క్లుప్తంగా

అన్నదానం



ప్రేమాలయ వసతి గృహంలో అన్నదానం చేస్తున్న శివయాదవ్, మహేశ్వరి

కడప కార్పొరేషన్: పేదల ఆకలి తీర్చే భాగ్యం తమకు కలగడం అదృష్టంగా భావిస్తున్నామని డాక్యుమెంట్ రైటర్ నూకనబోయిన శివయాదవ్ అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ ఆవరణలోని ప్రేమాలయ వసతి గృహంలోని వృద్ధులకు ఎన్‌టి మహేశ్వరి, సహస్రయాదవ్ ఆధ్వర్యంలో ఉదయం అల్పాహారం , మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ తండ్రి గంగన్న యాదవ్ వర్థంతి సందర్భంగా అన్నదానం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీసాయి సేవా సమితి అధ్యక్షుడు ఎం. చంద్రశేఖర్‌రెడ్డి, భరత్ యాదవ్, చరణ్, ఆనంద్‌బాబు, శంకర్‌రెడ్డి, ఎన్. రమణారెడ్డి, రఘురాం, వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

డ్రాయింగ్ పుస్తకాలు అందజేత



డ్రాయింగ్ పుస్తకాలను అందజేస్తున్న ఉదయభాస్కర్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని మా అమ్మ ఒడి ఆశ్రమంలో ఉంటున్న చిన్నారులకు డ్రాయింగ్ పుస్తకాలను అందజేశామని నగర వాసి ఉదయభాస్కర్ తెలిపారు. మంగళవారం సైన్స్ ఫెయిర్ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల్లో బొమ్మలు గీయడంలో ఆసక్తిని పెంపొందించేందుకు ఈ పుస్తకాల పంపిణీ చేపట్టామని తెలిపారు.

తెలుగు సాహితీ యాత్రలో పాల్గొనండి

కడప సెవెన్‌రోడ్స్ : తాము జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న తెలుగు సాహితీ యాత్రలు, మహా కవయిత్రి మొల్ల జయంతి ఉత్సవాల్లో పాల్గొనాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌ను ఆహ్వానించామని సాహితీవేత్త విద్వాన్ గానుగపెంట హనుమంతరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన కలెక్టర్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ సాహితీ యాత్రలలో భాగంగా ఈనెల 25వ తేదీ కలెక్టర్ తమ ఆహ్వానంపై బద్వేలుకు రానున్నారని తెలిపారు. ఈనెల 13వ తేదీ మొల్ల జయంతిని రాష్ట్ర ప్రభుత్వ పండుగగా నిర్వహించనుండడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మొల్ల సాహితీపీఠం ప్రధాన కార్యదర్శి జీవీ మనోజ్ కుమార్, పీఠం సభ్యులు రవి కల్యాణ్, మునికుమార్, బాలయ్య, కొంకుల శ్రీనివాసులు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ధర్మసంస్థాపనే ధ్యేయం



ప్రచారం నిర్వహిస్తున్న త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి సభ్యులు

కడప కల్చరల్ : ధర్మ సంస్థాపనే ధ్యేయంగా తమ సంస్థ త్రైత సిద్ధాంతాలతో కూడిన భగవద్గీతను ప్రచారం చేస్తోందని త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి సభ్యులు పేర్కొన్నారు. సంస్థ హిందూ జ్ఞాన వేదిక స్థానిక కమిటీ సభ్యులతో కలిసి మంగళవారం కడప నగరంలోని అశోక్‌నగర్ ప్రాంతంలో సభ్యులు ప్రచారం చేశారు. ఇందులో భాగంగా వారు ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను నగర వాసులకు దర్శింపజేసి వాటి సారాంశాన్ని వివరించారు. ఆత్మ, జీవాత్మ, పరమాత్మ అనే మూడు ఆత్మల వివరాలు తెలుసుకోవడంతో ధర్మ సంస్థాపన జరుగుతుందని, అదే త్రైత సిద్ధాంతం ముఖ్య ఉద్దేశ్యమని వారు ప్రచారం చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు నవనీశ్వర్‌రెడ్డి, సభ్యులు ఈశ్వర్, సదానందుడు, యల్లారెడ్డి, వెంకట రమణ, మణి, నాగేంద్ర, రామనాథం తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రొద్దుటూరు: ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ యూనియన్ గౌరవాధ్యక్షుడు బి.రామయ్య, జిల్లా అధ్యక్షుడు వై.హరి అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఆటో కార్మికులతో కలిసి మంగళ వారం ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్, గ్యాస్ జీఎస్టీ పరిధిలోకి తేవాలని, జీఓ 2131 రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన గెజిట్ నోటిఫికేషన్ 894ను రద్దు చేయాలన్నారు. డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఈఎస్ఐ, పీఎఫ్‌తో కూడిన పెన్షన్ సౌకర్యం కల్పించాలని, చంద్రన్న బీమా కింద రూ.10 లక్షల బీమా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

చక్కటి రాత.. మార్కుల మోత..



పది పరీక్షలకు సన్నద్ధం అవుతున్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: పదవ తరగతి విద్యార్థులలో పరీక్షల 'టెన్'షన్ మొదలైంది. తొలిసారి పబ్లిక్ పరీక్షలు అనగానే మనసులో తెలియని భయం, ఆందోళన . తెలిసిన సమాధానాలే అయినా వాటిని పేపరుపై రాయడంలో కొందరు తికమకపడతూ తప్పులు రాసి కొట్లు పెడుతూ ఉంటారు. తరగతి గదిలో టకీమని సమాధానాలు చెప్పే విద్యార్థులు సైతం మార్కుల సాధనలో వెనుకబడి ఉంటారు. కారణం వచ్చిన సమాధానాలు సరిగ్గా రాయలేకపోవడమే. ఈ చిన్న అవరోధాన్ని అధిగమిస్తే విజయం వారి సొంతమవుతుంది. ఈ నెల 17వ తేదీ నుంచి పది పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులకు నిపుణులు సూచనలు సలహాలు ఇస్తున్నారు. అవి ఇలా..

- ఏడాది మొత్తం చదివింది ఒక ఎత్తయితే. మూడు గంటల్లో పరీక్షలో సక్రమంగా రాయడం అనేది మరో ఎత్తు . అన్ని సమాధానాలు తెలిసినా వాటిని సక్రమంగా సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ మూడు గంటల్లో జవాబుపత్రంపై సమగ్రంగా రాయలేకపోతారు. అందుకు ఈ అంశాలను గుర్తించాలి.
- జవాబులను సూటిగా రాయాలి.
- మనం రాసే తీరు పరీక్ష పేపర్ దిద్దేవారిని ఇబ్బంది పెట్టేలా ఉండకూడదు.
- వ్యాకరణ దోషాలు లేకుండా చూసుకోవాలి.
- దిద్దుబాటు. గజిబిజిగా అసలే ఉండకూడదు పదానికి పదానికి మధ్య దూరం ఉండాలి.
- చేతి రాత గుండ్రంగా ఉండటంతోపాటు అర్థమయ్యేలా ఉండాలి.

అక్షరం బాగుంటే విజయం మీదే...

విద్యార్థి చేతి రాతను బట్టి సబ్జెక్టులో అతని అవగాహన స్థాయిని అంచనా వేయవచ్చు. పరీక్షలు రాసే విద్యార్థులు ఎంత తెలివైన వారనేది జవాబు పత్రాలు దిద్దేవారికి తెలియదు. వారు రాసే తీరు అక్షరాల కూర్పును బట్టి వారి ప్రతిభను అంచనా వేస్తారు. ఈ విషయంలో చేతిరాతకు ఎంతో ప్రాధాన్యం ఉంది. అందమైన దస్తూరి చూసే వారికి ఇట్టే ఆకట్టుకుంటుంది. జవాబు పత్రాలు మూల్యాంకనం చేసే వారి మనసుకు హత్తుకుని మార్కులు వేసేలా ప్రేరేపిస్తుంది.

విద్యార్థులు చేసే పొరపాట్లు..

కొందరు విద్యార్థులు ఒక జవాబు పత్రంపై 25-30 లైన్లు రాస్తారు. గజిబిజిగా దగ్గరగా ఉండటంతోపాటు జవాబు పత్రం చూడగానే ఆకట్టుకోదు. అందువల్ల ఒక్కో పేజీలో 16-18 లైన్లకు మించకుండా చూడాలి. లైన్లు సమాంతరంగా ఉండాలి. సాధ్యమైనంతవరకు పదాలను ఒకే లైన్లలో వచ్చేలా రాయాలి. చాలా మంది విద్యార్థులు బాగా ఒత్తిపట్టి రాస్తుంటారు. పెన్నును వేళ్లతో బిగుతుగా పట్టుకుంటారు. దీంతో పేజీ రెండో వైపు ఆ అక్షరాలు కనిపిస్తూ చివరికి జవాబుపత్రం గజిబిజిగా తయారవుతుంది. పైగా విద్యార్థులకు కూడా రాయడం మొదలు పెట్టిన కొద్ది సేపటికే వేళ్ల నొప్పి పెడతాయి. చాలా మంది విద్యార్థులు అంకెలను సరిగా రాయరు. 2 అంకెను ఇంగ్లీష్ జెడ్ తరహాలో, 5ను ఎస్ తరహాలో, 0 ను 6 తరహాలో రాస్తుంటారు. ఫలితంగా రావాల్సిన మార్కులు తగ్గిపోతాయి.

చేతిరాత బాగుండాలి



ఎంత చదివినా, ఎంత నేర్చుకున్నా మనం రాసే అక్షరాలు స్పష్టంగా అందంగా ఉన్నప్పుడే మంచి మార్కులు సాధించగలం. ప్రశ్నలు నెంబర్లు స్పష్టంగా తప్పులు లేకుండా వేయాలి. కొట్టివేతలు లేకుండా జాగ్రత్తగా రాయాలి. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ పరీక్షలు రాసేటప్పుడు అక్షర దోషాలు లేకుండా చూసుకోవాలి. పదానికి పదానికి మధ్య ఖాళీ ఉండేలా చూడాలి. – బి. పవన్‌కుమార్, చేతిరాత నిపుణులు, కడప.

మూల్యాంకనంలో ప్రాధాన్యం



మంచి దస్తూరికి మూల్యాంకనంలో ప్రాధాన్యం ఉంటుంది. చక్కగా రాసిన వారికి మంచి మార్కులు వస్తాయి. తప్పులు, కొట్టివేతలు లేకుండా రాయాలి. అలాగని దస్తూరి సరిగ్గా లేని వారు ఆందోళన పడాల్సిన పనిలేదు. సమాధానాలు అర్థమయ్యేలా చూసుకోవాలి. ఉన్నంతలో మెరుగ్గా రాసేందుకు ప్రయత్నం చేస్తే మంచి మార్కులు వస్తాయి. – షేక్ షంషుద్దీన్, డీఈఓ, వైఎస్సార్ జిల్లా

14న బంజారా హోలీ



బంజారా హోలీ సంబరాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప రూరల్: ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన కడపలోని గిరిజన భవన్‌లో బంజారా హోలీ సంబరాలను నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంజారాలు ఉన్నత చదువులు చదివి, గొప్ప స్థాయికి ఎదగాలన్నారు. అన్ని రంగాల్లో రాణించి, ఆర్థికంగా ఎదగాలని కోరారు. బంజారాల సంస్కృతి ఎంతో గొప్పదని అన్నారు. ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి డాక్టర్ శివానాయక్ మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన కడప నగరం శిల్పారామం వద్ద గల గిరిజన భవన్‌లో హోలీ సంబరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి బంజారా కుటుంబం సంబరాల్లో పాల్గొని కార్యక్రమంను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జగన్‌రాథోడ్, రాష్ట్ర నాయకులు మూడే వెంకటస్వామి నాయక్, అర్జున్ నాయక్, ధాకే నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



పూడికతీత పనులు చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కడప కార్పొరేషన్: కడప నగరంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి పరిశీలించారు. మంగళవారం ఆయన మార్నింగ్ విజిట్‌లో భాగంగా భగత్ సింగ్ నగర్ పార్కు, వినాయకనగర్ జీటీఎస్, కలుములోపల్లె డంపింగ్ యార్డ్‌లను పరిశీలించి అధికారులకు తగు సూచనలు అందజేశారు. అనంతరం జిల్లా పరిషత్ ఆవరణంలో అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు.

– కమిషనర్ ఆదేశాల మేరకు మలేరియా నివారణ విభాగం ఆధ్వర్యంలో దోమల నివారణ చర్యలు విస్తృతంగా చేపడుతున్నట్లు పబ్లిక్ హెల్త్ అధికారులు తెలిపారు. రవీంద్రనగర్, మారుతీనగర్, టీటీడీ కళ్యాణ మండపం ప్రాంతాల్లో పూడికతీత పనులు నిర్వహించారు. ఫక్కీరుపల్లె, ఎంజేకుంట ప్రాంతాల్లో ఫాగింగ్, అక్కాయపల్లె, మారుతీనగర్, రాధాక్రిష్ణ నగర్‌లలో స్ప్రేయింగ్ చేసినట్లు చెప్పారు.

ప్రమాదకర విద్యుత్ స్తంభాన్ని తొలగించండి



ఒక వైపునకు వంగి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

కడప వైఎస్ఆర్ సర్కిల్: నగర శివార్లలోని 45వ డివిజన్ ఊటుకూరు గ్రామంలో విద్యుత్ స్తంభం ఒరిగి ప్రమాదకరంగా మారింది. రహదారికి ఆనుకొని విద్యుత్ స్తంభం ఉండటం.. ఈ దారిలో నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తుండడంతో ప్రమాదం పొంచి ఉంది. విద్యుత్ స్తంభం మార్చాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా కనీసం పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమ స్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

వైవీయూలో ఉత్సాహభరితంగా క్రికెట్ పోటీలు



విజేతగా నిలిచిన జట్టుతో ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, క్రీడ శాస్త్రాల విభాగాధిపతి రామసుబ్బారెడ్డి

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయ కాలేజ్ డే, ఫౌండేషన్ డే సందర్భంగా కళాశాల అంతర విభాగ క్రీడా పోటీలలో భాగంగా మంగళవారం జరిగిన బోధన సిబ్బంది క్రికెట్ ఫైనల్ పోటీలను ప్రధానాచార్యులు ప్రొఫెసర్ ఎస్. రఘునాథ రెడ్డి ప్రారంభించారు. ఈ పోటీలలో వైవీయు పరీక్షల నియంత్రణ అధికారి ప్రో. కె ఎస్ వి కృష్ణ రావు కెప్టెన్ గా వ్యవహరించిన జట్టు విజయం సాధించి మొదటి స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో మాజీ రిజిస్ట్రార్ డి.విజయ రాఘవ ప్రసాద్ కెప్టెన్‌గా వ్యవహరించిన జట్టు నిలిచింది.

ఆశా కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



ఆశాడే కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఆశా కార్యకర్తలకు కనీస వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ ఆశా వర్కర్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు గుంటి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని అర్బన్ హెల్త్ సెంటర్లలో జరుగుతున్న ఆశా డే సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలపై గత ప్రభుత్వంతో చర్చలు జరిపి ఒప్పందం చేసుకున్న ఒప్పంద కాపీలను ఏడాది అయినప్పటికీ జీవోలను విడుదల చేయ లేదని తెలిపారు. ఆశా కార్యకర్తలు పని ఒత్తిడితో అనారోగ్యం పాలవుతున్నప్పటికీ సెలవులు ఇవ్వడం లేదని, తక్షణం సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తలకు వయోపరిమితితో సంబంధం లేకుండా పదోన్నతి కల్పించాలని కోరారు. ప్రభుత్వం తక్షణం ఏఎన్ఎం నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కేసి బాదుల్లా ఆశా యూనియన్ నగర నాయకులు నిర్మల ప్రియదర్శిని, జమాల్ బి, వెంకటరత్నమ్మ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ ఈదురుబాషా

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఇన్‌స్పెక్టర్ ఈదురుబాష సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కడప యస్వీ డిగ్రీ కళాశాల విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్తృత్వ పోటీలు మహిళలు సాధికారత, సమానత్వం, హక్కులు, మహిళా భద్రత వంటి అంశాలపై అవగాహన పెంపొందించేందుకు దోహద పడతాయన్నారు. మహిళల హక్కుల పరిరక్షణ, భద్రతపై పోలీసులు నిరంతరం కృషి చేస్తారని పేర్కొన్నారు. అలాగే మహిళా చట్టాలు, పోక్సోయాక్ట్, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, సామాజిక మాధ్యమాలు, సైబర్ క్రైమ్స్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, ఉమెన్ హెల్ప్‌లైన్ 181, పోలీసు హెల్ప్‌లైన్ 100, 112, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 గురించి వివరించారు. కార్యక్రమంలో మహిళా పీఎస్ఐ శ్రీనివాసులు, యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఎస్ఐ శాంతమ్మ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు వ్యవసాయ భూమి పంపిణీ చేయాలి



జిల్లా సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఓబుళపతి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు మూడు ఎకరాలు చొప్పున వ్యవసాయ భూమి పంపిణీ చేయాలని దళిత భూ సాధన పోరాట సమితి జిల్లా అధ్యక్షులు పి.ఓబుళపతి, నాయకులు పచ్చారం బాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కడప నగరం ఆజాద్‌నగర్‌లోని ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన జిల్లా సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. వైఎస్ఆర్ మొట్టమొదటిసారిగా భూ పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. అప్పట్లో ఏడు విడతల్లో భూ పంపిణీ జరిగిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు కూడా భూ పంపిణీ నిర్వహించారన్నారు. ప్రస్తుతం అధికారులు ఎస్సీ ఎస్టీలకు భూములు కేటాయించాలని చెబుతున్న మాటలు కాగితాలకే పరిమితమయ్యాయన్నారు. ఇల్లు లేని ప్రతి కుటుంబానికి మూడు సెంట్ల స్థలం కేటాయించడంతోపాటు ప్రభుత్వమే పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలన్నారు. ఎస్సీ ఎస్టీల కోసం కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని, అయితే ఎందరికి మంజూరు చేశారో చెప్పాలని ప్రశ్నించారు. బ్యాంకు లింకేజీతో సంబంధం లేకుండా విరివిగా రుణాలిచ్చి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధికార ప్రతినిధి ఎ. బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్ఎస్ రాజా, ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారావు, కార్యదర్శి కనకరాజు, నాయకులు వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల విజ్ఞానదాయక సందర్శన



విద్యార్థులకు తాళపత్రాలను చూపుతున్న డాక్టర్ చింతకుంట శివారెడ్డి

కడప కల్చరల్ : నగరంలోని నకాష్‌లోగల పురపాలక ఉర్దూ ఉన్నత పాఠశాల, సాయిపేట పురపాలక ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం స్థానిక సీపీ బ్రౌన్ స్మారక గ్రంథాలయం, భాషా పరిశోధన కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథాలయ సహాయకులు ఎస్.రమేశ్ రావులు గ్రంథాలయంలోని పుస్తకాలతోపాటు, తాళపత్రగ్రంథాలు, తామ్రపత్రం, తాళపత్రాలపై రాసే ఘంటాలు, చేతితో తయారుచేసిన కాగితం రాతప్రతులు, రాగి నాణాల వివరాలను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సాయిపేట పాఠశాల తెలుగు స్కూల్ అసిస్టెంట్ సునీల్‌కుమార్, నకాష్ పాఠశాల గణితం ఉపాధ్యాయులు సయ్యద్ జమీల్, సైన్స్ టీచర్ కె.నయబ్ రసూల్, ఉర్దూ టీచర్ ఎస్.కె.నజీమా పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాహు కాల పూజలు



విజయదుర్గమ్మ సన్నిధిలో మంగళవారం సాయంత్రం రాహుకాల పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున అర్చక బృందం అమ్మవారి మూలమూర్తికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మంగళకరమైన అలంకారం చేసి భక్తులను దర్శనాలకు అనుమతించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.

-కడప కల్చరల్

బస్సు నిలపలేదని డ్రైవర్‌పై దాడి

కడప అర్బన్: కడప తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం అలంఖాన్‌పల్లె సమీపంలో ఆర్టీసీ బస్సును నిలపలేదని ఆవేశంతో అదే ప్రాంతానికి చెందిన క్రిష్టారెడ్డి, అద్దె బస్సు డ్రైవర్ వేలూరు బాలయ్యపై చెప్పుతో దాడి చేశారు. ఈ సంఘటనపై పోలీసులు విచారణ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం సీజ్

కడప అర్బన్: కడప తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా రేషన్ బియ్యంను తరలిస్తున్న ఆటోను సీజ్ చేశారు. చెన్నూరుకు చెందిన ఆటో డ్రైవర్ వెంకటరమణను వినాయక్‌నగర్ వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 50 కిలోల 24 రేషన్ బియ్యం బస్తాలు , ఆటోను సీజ్ చేశారు.

ఎన్ఎంసీ నిబంధనల అమలు పట్టదా..?

కడప అర్బన్: కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, వైద్యకళాశాలలో వైద్య విద్యను పూర్తి చేసుకున్న హౌస్‌సర్జన్‌లకు సరైన శిక్షణ లేకుండా పూర్తి వైద్యులుగా గుర్తించడం సరికాదని ప్రభుత్వ మానసిక వైద్యశాల (ఐఎంహెచ్) సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్. వెంకటరాముడు మంగళవారం ఒక పత్రికా ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హౌస్ సర్జన్‌లు వారి సంవత్సర కాలంలో రెండు వారాలు మానసిక వైద్య విభాగంలో పనిచేసే అనుభవం గడించటం నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్.ఎం.సీ) నిబంధనల ప్రకారం తప్పనిసరి అన్నారు. కానీ ఈ మార్గదర్శకాలను తుంగలో తొక్కి, అసలు వారిని మానసిక విభాగం వైపు కన్నెత్తిఅయినా చూడకుండా గత నాలుగు సంవత్సరాలుగా ఎం.బి.బి.ఎస్ అభ్యసించే వారికి వైద్య పట్టాలు ఇస్తున్నారు. సరైన శిక్షణ లేకుండా వారిని పూర్తి వైద్యులుగా మెడికల్ కౌన్సిల్ గుర్తించడం తగదన్నారు. మానసిక సమస్యలు రోజురోజుకు పెరుగుతున్న క్రమంలో ఈ వివక్ష ప్రమాదకరమైన హెచ్చరిక అని పేర్కొన్నారు. ఈ మానసిక సమస్యలపై పూర్తి అవగాహన లేకపోవడంతో త్వరగా మానసిక జబ్బులను గుర్తించే నైపుణ్యం కోల్పోతున్నారన్నారు.

ప్రతి ఒక్కరికీ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

ప్రొద్దుటూరు క్రైం: ఎన్‌సీడీ సర్వేలో భాగంగా ప్రతి ఒక్కరికీ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు తెలిపారు. పట్టణంలోని శ్రీనివాస నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం ఆశా వర్కర్లతో జరిగిన సమావేశంలో డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రతి ఇంటిని సందర్శించి కుటుంబ సభ్యులందరికీ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయాలన్నారు. ప్రొద్దుటూరు అర్బన్ నుంచి ఇప్పటి వరకూ ఒక్క క్యాన్సర్ కేసు రెఫర్ కాలేదని తెలిపారు. అనుమానిత లక్షణాలున్న వారిని గుర్తించడంలో నిర్లక్ష్యం పనికి రాదని, కొన్ని సచివాలయాల పరిధిలో తక్కువ సంఖ్యలో కేసులు నమోదవుతున్నాయని చెప్పారు. త్వరలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని, ప్రాథమిక దశలో గుర్తిస్తే నయం చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో బాల భవిత కేంద్రం ఉన్నట్లు చాలా మందికి తెలియదని, పుట్టిన పిల్లల మొదలు 18 ఏళ్ల వారికి అక్కడ అధునాతన వైద్యాన్ని అందిస్తున్నారని చెప్పారు.

దోసకు గిరాకీ



దోస కాయలకు గిరాకీ పెరిగింది. ఎండలు పెరిగిన నేపథ్యంలో చల్లదనం కోసం దోసకాయలు తినడానికి చాలా మంది ఇష్టపడతారు. పెన్నానదీ పరివాహక ప్రాంతంలో దోస పంట ఎక్కువగా సాగు చేశారు. కొందరు తోటల వద్దకే వచ్చి కాయలను తీసుకెళుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కడప